కె.బాలగోపాల్

# 'అన్యాయ' న్యాయానికి ఆమోదమా?

స్వప్నిక, ప్రణీతలపైన ఆసిడ్ దాడి చేసిన వారిని పోలీసులు అరెస్టు చేశారని వినగానే ఇక వారిని చంపేస్తారనుకున్నాను. చట్టం అనుకూలించకపోయినా 'ప్రజాగ్రహం' అనుమతిస్తుందనుకుంటే హత్య చేయడానికి వెనకాడే బలహీనులు కాదు మన పోలీసులు. ముద్దాయిలకు పెద్ద వాళ్లతో సంబంధాలుగానీ బంధుత్వంగానీ ఉంటే వేరే సంగతిగానీ, లేనట్టయితే వారిని కోర్టులో ప్రవేశపెట్టి నేర పరిశోధన చేసి సమర్థంగా నేర విచారణ జరిపించడం టైంవేస్ట్ అన్న అభిప్రాయానికి పోలీసు యంత్రాంగం వచ్చేసింది. చంపేసి ప్రజల భుజాలెక్కి హీరోలుగా ఊరేగితే ఒక పనయిపోతుందన్న నిర్ణయానికి వచ్చేసింది. అందులోనూ వరంగల్ జిల్లా పోలీసు యంత్రాంగానిది మరీ బరి తెగించిన వైఖరి. ఈ మధ్య కాలంలోనే ఇది వారు చేసిన నాలుగవ హత్యా సంఘటన. వారి చేతిలో హతమైన వారు అసాంఘిక నేరాలకు పాల్పడినవారు కాబట్టి వారి పైన సమాజంలో సహజంగానే కోపం ఉంటుంది. ఆ కోపాన్ని అడ్డు పెట్టుకొని వారిని చంపేసి, ప్రశ్నించిన వారి పైకి జనాన్ని ఎగదోయడం వరంగల్ పోలీసులు నేర్చుకున్నారు.

'ఇది నిజమైన ఎన్‌కౌంటర్ అయితే అందులో తప్పేమీ లేదు' అని మాజీ హోం మంత్రి కోడెల శివప్రసాదురావు అన్నారట. తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయిన తరువాత అన్ని విషయాలలోనూ అభిప్రాయం మార్చుకుంది గానీ ఈ ఒక్క విషయంలో మాజీ హోం మంత్రి గారికీ ప్రస్తుత హోంమంత్రి గారికీ అభిప్రాయ భేదం లేదు. ఎన్‌కౌంటర్లు చేయించడం అధికారంలో ఉన్న పార్టీ నీతి మాత్రమే కాదు, పాలకనీతి అనడానికి ఇంతకంటె నిదర్శనం అక్కర లేదు. అది 'నిజమైన ఎన్‌కౌంటర్' అని పామరులు సహితం అనుకోవడం లేదు. మరి ఉన్నత విద్య అభ్యసించిన మాజీ హోంమంత్రిగారికి 'అయి ఉండవచ్చున'ని ఎట్లా తోచిందో! పోలీసులు సహితం అవి నిజమైన ఎదురు కాల్పులని ఎవరినీ నమ్మించే ప్రయత్నం చేయడం లేదు. ప్రాణాన్ని పణంగా పెట్టి పోరాడినందుకు కాదు వారు ప్రజల అభినందనలు కోరుకున్నది. దుర్మార్గులను హత్యచేసినందుకు కోరుకున్నారు. అభినందించిన వారు అందుకే అభినందించారు. చేసిన వారికీ మెచ్చుకునేవారికీ లేని విచక్షణ వ్యాఖ్యానించేవారికెందుకు? 'ఈ న్యాయస్థానాలు దుర్మార్గులను శిక్షించలేవు. మేము శిక్షిస్తాము.దానికి మమ్మల్ని ఊరేగించండి' అంటున్నారు పోలీసులు. ఇంక 'నిజమైన ఎన్‌కౌంటర్' ఎక్కడిది?

ఈ న్యాయస్థానాలు దుర్మార్గులను నిజంగానే శిక్షించజాలవనీ, దానికోసం కఠినతరమైన చట్టాలు కావాలంటే హక్కుల సంఘాలు అడ్డుపడుతున్నాయనీ వాదించడం ద్వారా పోలీసుల హత్యాకాండకు అంతిమంగా కఠినమైన చట్టాలను వ్యతిరేకించేవారూ బాధ్యులేనంటున్న వారూ ఉన్నారు. దీనికి రెండు జవాబులున్నాయి. ఒకటి, ఈ కేసు విషయంలో ఇది పూర్తిగా అసందర్భమైన వ్యాఖ్య. ఆ ముగ్గురినీ కోర్టులో విచారించి ఉంటే సెక్షన్ 307 కింద వారికి జీవిత ఖైదు పడి ఉండేది. బాధితురాళ్లు వాళ్లను గుర్తుపట్టారు. దాడికి ఆసిడ్ కొనుక్కున్న దుకాణాన్ని పోలీసులు గుర్తించారు. గతంలో ముద్దాయిలు పాల్పడిన కక్షపూరిత చర్యలకూ స్వప్నిక కుటుంబ సభ్యుల సాక్ష్యం ఉంది. సాక్షులు తెలిసీ నిజం చెప్పకపోవడానికి ముద్దాయిలేం మద్దులచెరువు సూర్యనారాయణ రెడ్లు కారు, నందమూరి బాలకృష్ణలు కారు. క్రూరంగా తయారయిన మామూలు మనుషులు. ఇంత సాక్ష్యం ఉండగా వారికి కోర్టులో శిక్షపడకపోవం కల్ల. పైగా ఆసిడ్ దాడిని చిన్న నేరంగా పరిగణించవద్దనీ చట్టం అనుమతించే గరిష్ఠ శిక్ష వేయడమే ఉచితమనీ ఈ మధ్యనే సుప్రీంకోర్టు ఒక తీర్పులో అనింది కూడ.



కోర్టు ఒకవేళ శిక్ష వేసినా కొన్నేళ్లకే ప్రభుత్వం క్షమాభిక్ష పేరిట వారిని ముందస్తుగా విడుదల చేస్తుంది కదా అనే వారూ ఉన్నారు. క్షమాభిక్ష మంచి చెడుల గురించి చాలా వాదించుకోవచ్చును గానీ, అసలు విషయం ఏమిటంటే ఈ మధ్య కాలంలో ముందస్తు విడుదల ఆదేశాలలో అసాంఘిక నేరాలకు పాల్పడిన వారిని మినహాయించ రివాజయింది. కాబట్టి వీరి విషయంలో ఆ ఆందోళన కూడ అనవసరం.

కాగా, ఒక సాధారణ వ్యాఖ్యగానయినా ఈ మాటలు ఎంతవరకు సబబని, ఏం తెలిసి మాట్లాడుతున్నారని అడగవలసి ఉంటుంది. నేరస్తులకు శిక్షపడకపోవడానికి నేర విచారణ వ్యవస్థ కఠినంగా లేకపోవడం కాదు కారణం. నేరపరిశోధనలో పోలీసుల అసమర్థత, నేరనిర్ధారణ పట్ల పౌరుల అనాసక్తి దీనికి ప్రధాన కారణాలు. పౌరుల అనాసక్తి గురించి ఇంకెప్పుడయినా మాట్లాడుకుందాం గానీ, తమ చట్టబాహ్యమైన నడవడికకు నేర విచారణా వ్యవస్థ వైఫల్యాన్ని పోలీసులు కవచంగా వాడుకోవడమే కాక అందుకు చాలా మంది నుంచి సమర్థన కూడ పొందుతున్నారు కాబట్టి వారి సామర్థ్యాన్ని గురించి మాట్లాడుకోవడం ఉచితంగా ఉంటుంది. నూటికి తొంభై కేసులలో వారు చేస్తున్న నేర పరిశోధన ఏమిటంటే అడ్డదార్లు తొక్కి, నేరానికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకోవడం, లేదా చేసుకున్నట్టు రిపోర్టు కల్పించడం, అందుబాటులో ఉన్న నలుగురు సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయడం, దానినీ దీనినీ కలిపి చార్జిషీట్ అని పేరు పెట్టి కోర్టు ముఖాన కొట్టడం. ఇంతకంటె వారికి తీరికా లేదు, శిక్షణా లేదు. రాజకీయ నాయకులకు అధికారికంగా, అనధికారికంగా సేవలు చేయాలి, తగవులు తెంపి పైసలు దండుకోవాలి, రాజకీయ పార్టీల మీటింగ్‌లకూ రోడ్ షోలకూ బందోబస్తు ఏర్పాటు చేయాలి, ఏలినవారికి ఇష్టంలేని కార్యకలాపాలు సాగకుండ చూడాలి. ఎన్ని పనులో వారికి!

కొంత వ్యవస్థ నుంచి వచ్చినది; కొంత తమ వైఖరి నుంచి వచ్చినది. అయిన ఈ అసమర్థత నేరనిర్ధారణ విఫలం కావడానికొక ముఖ్య కారణం కాగా, మళ్లీ తమకే విస్తృత అధికారాలు ఇవ్వడం ద్వారా ఆ వైఫల్యాన్ని పరిష్కరించాలని వారు దబాయిస్తున్నారు. ప్రపంచంలో అతికొద్దిమందికి ఈరకంగా వాదించే అదృష్టం లభిస్తుంది.

కాగా, నేర విచారణ వ్యవస్థ కఠినంగా ఉండాలి అని కోరుకునేవారు ఏరకమైన కాఠిన్యాన్ని కాంక్షిస్తున్నారో స్పష్టంగా చెప్పమని అడగడం అవసరం. ఏం కావాలి వారికి? నేరం న్యాయబద్ధంగా రుజువు కావాలి అనే సూత్రాన్ని సడలించాలా? ముద్దాయి చేత పోలీసు కస్టడీలో నేరం ఒప్పించి శిక్షించడానికి వీలు లేదనీ ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయాలనీ చెప్పే సూత్రాన్ని సడలించాలా? ముద్దాయి సమక్షంలోనే సాక్ష్యాలు నమోదు కావాలనీ సాక్షులను ఎదురు ప్రశ్న వేసే హక్కు ముద్దాయికి ఉండాలనీ చెప్పే సూత్రాన్ని సడలించాలా? దేన్ని సడలిస్తే నేర విచారణ వీరి దృష్టిలో తగినంత 'కఠినం' అవుతుంది? ఈ మార్పులు చేస్తే నేర విచారణే అన్యాయమైన రూపం తీసుకోదా? అన్యాయంగా 'న్యాయం' చేయడం ఒక నాగరిక సమాజం చేయదగ్గ పనేనా?

చట్టాలనూ కోర్టులనూ పక్కన పెడదాం. మన కళ్లముందే క్రూరంగా తయారవుతున్న సామాజిక సంస్కృతికి దుండగుల 'ఎన్‌కౌంటర్'లు పరిష్కారం అనుకోవడం వివిధ స్థాయిలలోని సామాజిక బాధ్యతను విస్మరించడం అవుతుంది. పిల్లలు మానవతా విలువలకు దూరమవుతుంటే తల్లితండ్రులు ఏం చేస్తున్నారని అడగనక్కర లేదు. వారు విద్యార్థులయితే వారి అధ్యాపకులు ఏం చేస్తున్నారని అడగనక్కర లేదు. వారితో కలిసి సినిమాలకూ షికార్లకూ పోయే స్నేహితులు ఏం చేస్తున్నారని అడగనక్కరలేదు. ప్రజా జీవిత సంస్కృతిని అమానవీయంగా తయారుచేస్తున్న సకల సంస్కృతీ బేహారులనూ మీ వ్యాపార లాభాల కోసం మీరేం చేస్తున్నారని అడగనక్కర లేదు. సరయిన సమయం వచ్చినప్పుడు ఒక సజ్జనార్‌కు చెప్తే చాలు, వారే కాగల కార్యం జరిపించేస్తారు. ఆ తరువాత మళ్లీ మరొక స్వప్నిక మీద దాడి జరిగేంతవరకు బతుకు ఎప్పటిలాగే గడిచి పోతుంటుంది కానీ ఒక ఘటన నుంచి మరొక ఘటనకు పోయేటప్పటికి జరిగేదేమిటంటే పోలీసుల చట్ట బాహ్యమైన హింసాకాండకు సాధికారిత పెరగడం. ఇది అన్నిరకాలుగా సమాజానికి నష్టకరం. విచ్చలవిడితనం ఈ హింసాకాండ ప్రముఖ లక్షణం. అధికారం తప్ప దానికి వేరే ప్రమాణం లేదు. భయం తప్ప వేరే నీతి లేదు. అది ఎవరిని శిక్షించాలో వారిని శిక్షిస్తుంది. ఎవరిని కాపాడాలో వారిని కాపాడుతుంది. హింసకు గురయిన స్త్రీల రక్షకులుగా పోలీసులివాళ ముందుకొచ్చారు. ఒక సంవత్సరం కింద విశాఖపట్నం ఏజెన్సీలోని వాకపల్లి అనే గ్రామంలో 11 మంది ఆదివాసీ స్త్రీలు గ్రేహౌండ్స్ పోలీసులు తమ ఊరిమీద దాడిచేసి తమపైన అత్యాచారం చేశారని ఆరోపించారు. ఒకసారి కాదు, ఒక వేదిక దగ్గర కాదు, పలుమార్లు ఆరోపించారు. కానీ ఆ కేసులో చట్ట బాహ్యమైన 'న్యాయం' కాదు సరికదా , చట్టబద్ధమైన న్యాయం సహితం పోలీసులు జరగనివ్వలేదు. హైకోర్టు ఆదేశించినా జరపలేదు. ఆ అత్యాచారానికి పాల్పడ్డవారి జాబితా సజ్జనార్ గారికిస్తే అక్కడ కూడ 'న్యాయం' చేసేసి పాడేరులో ప్రజల భుజాలెక్కి ఊరేగుతారా?

వరంగల్ ఘటనలో మీడియా పాత్ర గురించి రెండు మాటలు చెప్పకుండ ముగించడం భావ్యం కాదు. ముంబైలో జరిగిన దాడి సందర్భంగా ప్రజలలో ప్రతీకారేచ్ఛను విపరీతంగా రెచ్చగొట్టడంలో మీడియా పాత్ర గురించి మాబోటివాళ్లం విమర్శిస్తే మాకు దేశభక్తి కరువయిందని అన్నారు గానీ రెండు రోజుల క్రితం దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాలకృష్ణన్ అదే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆయన ఒక సెమినార్‌లో మాట్లాడుతూ ప్రతీకారకాంక్షను రెచ్చగొట్టే పద్ధతిలో వార్తల ప్రసారం చేస్తే ప్రభుత్వం పైన తొందరపాటు నిర్ణయాలు తీసుకునేటట్టు ఒత్తిడి పెట్టడం అవుతుందనీ, ప్రజల పౌర హక్కులకు భంగం కలిగించే చట్టాలు రూపొందించే దిశగా ఒత్తిడి పెట్టడం అవుతుందనీ, అది చాలా నష్టకరమనీ అన్నారు. వరంగల్ ఘటనలకూ ఇది వర్తిస్తుంది. తక్షణ ప్రతీకారం కావాలని స్వప్నిక, ప్రణీతలు కోరుకోవడం సహజం . కానీ ఆ కోరికను వరంగల్ యువత చేత అడిగి అడిగి చెప్పించిన దృశ్య మీడియా వైఖరిని ఆమోదించడం కష్టం. జరగబోయే ఎన్‌కౌంటర్‌కు ఇది భూమిక ఏర్పాటు చేసింది. ప్రజాస్వామ్యంలో ఒక ముఖ్య అంగంగా ఉన్న మీడియా ప్రజాస్వామ్యాన్ని పెంపొందించే దిశగా నడుచుకోవాలి తప్ప నాశనంచేసే దిశగా కాదు. సెన్సేషన్ కోసం ఇట్లాగే చేసుకుంటూ పోతే ఇతర ప్రజాస్వామ్య విధ్వంసకులను నిలదీసినట్టే మీడియానూ నిలదీసే రోజులొస్తాయి.

> నేరస్తులకు శిక్ష పడకపోవడానికి నేర విచారణ వ్యవస్థ కఠినంగా లేకపోవడం కాదు కారణం. నేరపరిశోధనలో పోలీసుల అసమర్థత, నేర నిర్ధారణ పట్ల పౌరుల అనాసక్తి దీనికి ప్రధాన కారణాలు. మన కళ్ల ముందే క్రూరంగా తయారవుతున్న సామాజిక సంస్కృతికి దుండగుల 'ఎన్‌కౌంటర్'లు పరిష్కారం అనుకోవడం వివిధ స్థాయిలలోని సామాజిక బాధ్యతను విస్మరించడం అవుతుంది.